క్లుప్తంగా

పోలీసుల సైకిల్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న డీఎస్పీ సతీష్‌కుమార్

పాల్వంచరూరల్: పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా పోలీసు అధికారులు ఆదివారం డీఎస్పీ సతీష్‌కుమార్ నేతృత్వంలో టీషర్టులు, క్యాప్‌లు ధరించి సైకిళ్లపై పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ప్రదర్శనలో సీఐ వినయ్‌కుమార్, ఎస్ఐలు సుమన్, రాఘవయ్య, ఏఎస్ఐలు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన వాకర్స్ క్లబ్ సభ్యులు

ఇల్లెందురూరల్: నేచర్‌పార్క్ పరిధిలోని కోరగుట్టపై వాకర్స్ క్లబ్ ప్రతినిధులు ఆదివారం పలు రకాల పండ్ల మొక్కలను నాటారు. బీఆర్ఎస్ నేత దిండిగల రాజేందర్, సాహితి విద్యా సంస్థల డైరెక్టర్ ఎంసీ నాగిరెడ్డి తదితరులు వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సమకూర్చిన మొక్కలను గుట్టపై పలు ప్రాంతాలలో నాటారు. మాట్లాడుతూ.. మనిషికి స్వచ్ఛమైన గాలి, మంచి వాతావరణం, ఫలసాయం అందించే మొక్కలను అవకాశం ఉన్న ప్రతీచోట నాటాలని సూచించారు. నాటిని ప్రతీ మొక్కను ఎదిగే వరకు సంరక్షించాలని కోరారు.

సింగరేణిలో ఫిట్టర్ పరీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న ఫిట్టర్ (ట్రైనీ) కేటగిరి–1 పరీక్షకు అంతర్గత అభ్యర్థులు 62 మంది హాజరయ్యారని జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) సామ్యేల్ సుధాకర్ తెలిపారు. ఆదివారం సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన పరీక్ష సెంటర్‌ను ఆయన పర్యవేక్షించారు. మాట్లాడుతూ... సంస్థలో ఖాళీగా ఉన్న 123 పోస్టులకు గాను 62 మంది దరఖాస్తు చేసుకున్నారని, 46 మంది పరీక్షకు హాజరైనట్లు తెలిపారు.

ఘనంగా స్కౌట్ ఫెలోషిప్ డే

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని సెంట్రల్ పార్క్‌లో ఇండియన్ స్కౌట్ అండ్ గైడ్ ఫెలోషిప్ 65వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భద్రాచలం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంఘం వెంకటపుల్లయ్య, సింగరేణి ఎడ్యుకేషన్ సెక్రటరీ గుండా శ్రీనివాస్ హాజరై కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో లోగాని శ్రీనివాస్, ఖాసిం, రామకృష్ణ, కనకదుర్గ, చిట్టిమల్ల బ్రహ్మంచారి, శర్మ, బొడ్డు శ్రీనివాస్, విజయకుమార్ ఉన్నారు.

అద్దె చెల్లిస్తా.. సమస్యలు పరిష్కరించండి..

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయానికి చెందిన ఫంక్షన్ హాల్ అద్దె చెల్లించడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు లీజుదారుడు హరీష్ తెలిపారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ... 1వ నంబర్ ఫంక్షన్ హాల్‌ను 2023 డిసెంబర్‌లో వేలంపాటలో లీజుకు తీసుకున్నానని, ఆరునెలల అద్దె రూ.20 ముందుగానే చెల్లించినట్లు చెప్పారు. అయితే ఫంక్షన్ హాల్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు ఈఓకు దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడంతో కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. అద్దె చెల్లించడం లేదని ఈఓ నాపై అసత్య ప్రచారం చేయడం సరికాదన్నారు.

ఖబరస్తాన్, ఈద్గా కమిటీ ఎన్నిక

కొత్తగూడెంఅర్బన్: రామవరంలోని ఐదు మసీదులు జామా మజీద్, మదీనా మజీద్, జంజం మజీద్, మజీద్ ఏ రహీం ఖురేషి, మజిదే ఆలీ, కలిసి ఖబస్తాన్, ఈద్గాలకు 25మందితో ఆదివారం కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ఎస్‌కె.ఫహీమ్ దాదాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆన్‌లైన్ సర్వీసెస్ సొసైటీ కమిటీ..

టేకులపల్లి: టేకులపల్లిలో ఆన్‌లైన్ సర్వీసెస్ సొసైటీ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తోటకూరి సందీప్ కుమార్, ఉపాధ్యక్షుడిగా కటుకోజ్వల సురేష్, కార్యదర్శిగా అన్నారపు సుధీర్, జాయింట్ సెక్రటరీగా జుమ్మిలాల్, కోశాధికారిగా రాయల కిషోర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మాలోత్ సంతోష్, ధరావత్ సాయి కృష్ణ, ధరావత్ దేవేందర్, బానోత్ వినోద్ కుమార్, సలహాదారులుగా కేశ వేణుగోపాలరావు, లీగల్ అడ్వైజర్‌గా రామకృష్ణ ఎన్నికయ్యారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం కమిటీ...

టేకులపల్లి: రాష్ట్రంలోని 23 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్)లలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆదివారం వరంగల్ పబ్లిక్ గార్డెన్‌లో సమావేశమై రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. బేతంపూడి గ్రామానికి చెందిన ఈఎంఆర్ఎస్ ఉద్యోగి ధరావత్ మోహన్‌లాల్ రాష్ట్ర కోశాధికారిగా ఎన్నికయ్యారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఇల్లెందుకు చెందిన మూడు రాంబాబు, ఉపాధ్యక్షుడిగా నాగరాజు ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా షఫీ, సుధీర్, రాజు, అశోక్, రవీందర్ గౌడ్, గోవింద్, శ్రీను, సురేష్, రమేష్ తదితరులు నియమితులయ్యారు.

బోల్తా కొడుతున్న వాహనాలు..

- నిత్యం మూలమలుపు వద్ద ప్రమాదాలు
- నియంత్రణపై దృష్టి పెట్టని అధికారులు



ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు, డివైడర్ ఎక్కిన లారీ

సుజాతనగర్: ఖమ్మం, కొత్తగూడెం రాష్ట్రీయ రహదారిపై గోధుమవాగు వంతెన సమీపంలోని మూలమలుపు వద్ద తరచు వాహనాలు పల్టీ కొడుతున్నాయి. ఈ మార్గంలో వంతెన దాటిన తరువాత వచ్చే మూలమలుపుతో నిత్యం వాహనదారులు హడలెత్తిపోతున్నారు. నెలరోజుల వ్యవధిలోనే నాలుగైదు భారీ వాహనాలు పల్టీ కొట్టాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

వంతెన.. ఆ వెంటనే మూలమలుపు..

భద్రాచలం, సత్తుపల్లి రైల్వే నిర్మాణంలో భాగంగా స్థానిక గాయత్రీనగర్ వద్ద ఆర్వోబీని నిర్మించారు. ఇందులో భాగంగా ఎప్పటి నుంచో ఉన్న గోధుమవాగు వంతెన పక్కనే మరో వంతెనను ఏర్పాటు చేశారు. ఖమ్మం వైపు నుంచే వెళ్లే వాహనాలు పాత వంతెన పైనుంచి కొత్తగూడెం వైపు వెళ్తుండగా.. కొత్తగూడెం వైపు నుంచే వాహనాలు కొత్త వంతెన పైనుంచి ఖమ్మం వైపు రాకపోకలు సాగిస్తున్నాయి. కొత్తగా నిర్మించిన వంతెనతో ఇక్కడ మూలమలుపు ఏర్పడింది. దీంతో ఇక్కడ నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పలువురు వాహనదారులు ఆరోపిస్తున్నారు.

రాత్రి వేళల్లోనే...

గడిచిన నెలరోజుల్లోని పరిస్థితిని గమనిస్తే ఈ మూలమలుపు వద్ద నాలుగైదు భారీ వాహనాలు బోల్తా పడ్డాయి. అయితే ఈ ప్రమాదాలన్నీ రాత్రి సమయంలోనే చోటుచేసుకున్నాయి. ఈ ప్రాంతంలో మూలమలుపు అని తెలిసేలా హెచ్చరిక బోర్డులు కానీ, మలుపు కనిపించేలా హైమాస్ట్ లైట్లు కానీ సంబంధిత అధికారులు ఏర్పాటు చేయలేదు. దీంతో రాత్రి వేళల్లో వచ్చే వాహనాలకు మూలమలుపు అర్థం కాక పల్టీ కొడుతున్నాయి. రెండు వైపులా ఉన్న మూలమలుపుతో వేగంగా వచ్చే వాహనదారులు వేగాన్ని నియంత్రించలేక ప్రమాదాలకు కారణమవుతున్నారు. అతివేగంతో వస్తున్న వాహనాలకు మూలమలుపు కనిపించక ఎప్పుడు పడిపోతాయోమోననే భయాందోళనల మధ్య ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ మూలమలుపు వద్దే గతంలో ఓ ద్విచక్రవాహనం వంతెన పక్కనే ఉన్న లోయలోకి వెళ్లడంతో వాహనదారుడు మృతి చెందిన విషయం విదితమే. కొన్నిరోజులుగా ఈ ప్రాంతంలో వాహనాలు పల్టీలు కొట్టగా పలువురు గాయపడ్డారు. ఇక్కడ వాహనాల వేగం తగ్గేలా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉన్నా పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా వేగ నియంత్రణ మలుపులను సూచించే బోర్డులు ఏర్పాటు చేయించి ప్రమాదాలు జరగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



పల్టీ కొట్టిన లారీ

పలు ప్రమాదాలు..

గతంలో ఈ మూలమలుపు వద్ద రాఘవాపురం గ్రామానికి చెందిన ఓ యువకుడు మృతి చెందగా.. ఈ వంతెన సమీపంలోనే ఇటీవల మరొకరు మృతి చెందారు. ఈ రహదారిలో మంగపేట గ్రామవాసుల కోసం ఏర్పాటు చేసిన డివైడర్ ప్రక్రియ ప్రమాదాలకు నిలయంగా మారిందనే ఆరోపణలు వినపడుతున్నాయి. గ్రామస్తుల రాకపోకల నిమిత్తం ఆర్వోబీ వంతెన చివర అండర్‌పాస్ ఏర్పాటు చేస్తే ప్రమాదాలు జరగకపోయేవి. కానీ రహదారి మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్ గుండా ద్విచక్రవాహనదారులు, పాదచారులు రోడ్డు దాటుతున్న సమయంలో వాహనాలు ఢీకొట్టి మృత్యువాత పడుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి..



తరచు ఇదే ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా నివారణకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. – ఉడుగుల శ్రీకాంత్, వేపలగడ్డ

మూలమలుపుతో ప్రమాదాలు...



గోధుమవాగు వంతెన వద్ద గల మూలమలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఆర్వోబీ, నూతన వంతెన వద్ద లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. తక్షణమే చర్యలు తీసుకోవాలి. – మాలోత్ రాములు, గరీభ్‌పేట

పత్తికి గిట్టుబాటు ధర ప్రకటించండి

జూలూరుపాడు: పత్తి క్వింటాకు గిట్టుబాటు ధర రూ.10వేలు ప్రకటించాలని సీపీఎం మండల నాయకుడు వల్లమల్ల చందర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జూలూరుపాడులో ఆయన మాట్లాడుతూ... ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అత్యధిక విస్తీర్ణంలో రైతులు పత్తి ప్రధాన పంట సాగు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతీ ఏటా పత్తి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నట్లు పేర్కొన్నారు. ఒక వైపు ప్రకృతి వైపరీత్యాలతో పత్తి దెబ్బతింటుండగా, మరోవైపు ప్రభుత్వం మద్దతు ధర కల్పించకపోవడంతో మార్కెట్‌లో దళారీల చేతుల్లో రైతులు మోస పోతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో బానోత్ మధు, ఇస్లావత్ భద్రు, సీతారాములు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి..

టేకులపల్లి: సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు ఏడేళ్లుగా పెంచలేదని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా టీయూసీఐ, యూనియన్ అనుబంధ సంస్థ ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(టీయూసీఐ) రాష్ట్ర అధ్యక్షుడు షేక్ యాకుబ్‌షావలీ అన్నారు. ఈ మేరకు ఆదివారం కేటీసీ పీఓ కార్యాలయం ఆవరణలోని మస్టర్ అడ్డా వద్ద జరిగిన సమావేశంలో మాట్లాడారు. పదేళ్ల పరిపాలనలో కేసీఆర్ అన్నిరకాల కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచి సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులెవరూ లేరని అబద్ధాలు మాట్లాడినందుకు సింగరేణిలో తగిన గుణపాఠం చెప్పారని తెలిపారు. ప్రజాపాలన అందిస్తానన్న కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి సంవత్సరం కావొస్తోందని, కాంట్రాక్ట్ కార్మికులందరూ వేతనాలు పెంచుతుందని గంపెడాశతో ఎదురుచూస్తున్నారని, కాలయాపన చేయకుండా వెంటనే సింగరేణిలో సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. 2012లో 8వ వేతన ఒప్పందం చర్చల్లో కోల్ ఇండియా వేతన ఒప్పందం హైపవర్ కమిటీ వేతనాలైనా జీఓ నంబర్ 22కు గెజిట్ చేసి వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జరుపుల సుందర్, పాయం వెంకన్న, ధ్రువకుమార్, యాకూబ్ పాషా, సైదులు, వేణు, రామ్ కుమార్, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, బాలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యాకూబ్‌షావలీ

మొక్కజొన్న కొనుగోళ్లపై చర్చలు



వ్యాపారులతో చర్చిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయంలో మార్క్‌ఫెడ్ నుంచి స్పందన కొరవడింది. దీంతో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు రూ.2,225ను పరిగణనలోకి తీసుకున్న న్యూడెమోక్రసీ, మాస్‌లైన్ నేతలు మొక్కజొన్న కొనుగోళ్లకు సంబంధించి పోలారం గ్రామంలో వ్యాపారస్తులతో ఆదివారం చర్చలు జరిపారు. బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం మొక్కజొన్నకు డిమాండ్ ఉన్నందున ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు మించి రైతుల నుంచి మొక్కజొన్నలు కొనుగోలు చేయాలని ఆయా పార్టీల నేతలు వ్యాపారుల వద్ద ప్రతిపాదించారు. రూ.2,370కు కొనుగోలు చేసేందుకు వ్యాపారులు అంగీకారం కుదిరింది. ఈ ధర నేటి నుంచి నవంబర్ 2వ తేదీ వరకు కొనసాగుతుందని, తదుపరి మార్కెట్ రేట్లను బట్టి రేట్లపై చర్చించాలని నిర్ణయించారు. ఆవునూరి మధు, నాయిని రాజు, వ్యాపారులు పొద్దుటూరి సురేష్, ఉపేందర్, రమేష్, ఉమామహేష్, రాంలాల్, భూక్యా రాందాస్, ధరావత్ రవి పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి

సింగరేణి(కొత్తగూడెం): ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం వేసే కమిటీలు, లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ అన్నారు. ఆదివారం మంచికంటి భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లబ్ధిదారుల ఎంపిక గ్రామ కమిటీల ద్వారా చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న ప్రజలకు పట్టాలు ఇచ్చి, మొదటి దశ ఇందిరమ్మ ఇళ్లు వారికే కేటాయించాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జిల్లాలో ప్రతిపంట చేతికి వచ్చిందని మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్, కే.పుల్లయ్య, ఎం.నర్సిరెడ్డి, ఎం.జ్యోతి, కారం పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

హామీలు అమలు చేయండి

పాల్వంచరూరల్: ప్రభుత్వం ఆరుగ్యారంటీల హామీలో భాగంగా తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ఉద్యమకారుల ఫోరం జిల్లా కన్వీనర్ మంజూరు, టీయూఎఫ్ యువజన విభాగం రాష్ట్ర కన్వీనర్ మసూద్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటిస్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు, రూ.2500 పెన్షన్, నామినేటెడ్ పదవుల్లో 25శాతం వాటా కల్పించాలని, ఇందిరమ్మ కమిటీలో స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. రవిగౌడ్, కేసరి రవీందర్, శ్రీనివాసరెడ్డి, పి.సుబ్బారావు, మోహన్‌రావు, నాగేశ్వరరావు, బుడగం రవికుమార్, శ్రీను, ఐలయ్య పాల్గొన్నారు.

నేడు ప్రజావేదిక

జూలూరుపాడు: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు సామాజిక తనిఖీ ప్రజావేదిక జరగనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ తాళ్లూరి రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా

జూలూరుపాడు: రైతులందరికీ రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలని, రైతు భరోసా పథకం రెండు పంటలకు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్ర నరేంద్రకుమార్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

విద్యుత్ కోత..

పాల్వంచరూరల్: పాల్వంచ పట్టణంలో సోమవారం విద్యుత్ కోత విధించనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరాకాలనీ సబ్ స్టేషన్ పరిధిలోని కాంట్రాక్టర్స్ కాలనీ, ఇందిరా కాలనీ, జయమ్మ కాలనీ, బాపూజీ నగర్, హమాలీ కాలనీ, సీతానగర్ కాలనీలో నేడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

శ్మశానవాటికల్లో సౌకర్యాలు కల్పించండి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): దీపావళి సందర్భంగా కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలు, గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని, శ్మశానవాటికల్లో సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే కూనంనేని అధికారులను ఆదేశించారు. ఆది వారం అధికారులకు చేపట్టాల్సిన చర్యలను ఫోన్‌లో వివరించారు. కొత్తగూడెం, పాల్వంచ ప్రధాన రహదారిలో విద్యుత్ దీపాలను సరిచేయాలని సూచించారు. దీపావళి సందర్భంగా ప్రజలు తమ పెద్దలను స్మరించుకునేందుకు శ్మశానవాటికలకు వెళ్తుంటారని వాటిని శుభ్రం చేయాలన్నారు.

పాదయాత్రకు తరలిరండి..

ఇల్లెందు: మాల మహానాడు పాదయాత్ర ఆదివారం రాత్రి ఇల్లెందుకు చేరుకుంటుందని, సోమవారం కరెంటాఫీస్ సెంటర్ నుంచి ఇల్లెందులో సాగుతుందని మాలలు విజయవంతం చేయాలని ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు కాలే పుల్లయ్య ఆదివారం తెలిపారు.

మారని ఇల్లెందు తలరాత..

ఇల్లెందు: పాలకులు మారినా ఇల్లెందు తలరాత మారటం లేదని సీపీఎం జిల్లా నాయకుడు ఎస్ఏ నబీ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఇల్లెందు సీపీఎం కార్యాలయంలో మండల కమిటీ సమావేశం జరిగింది. మాట్లాడుతూ... ఉమ్మడి జిల్లా నుంచి ఇల్లెందు నియోజకవర్గం వరకు అన్యాయం జరిగిందన్నారు. ఇల్లెందు కంటే చిన్న మండలాలు ఉన్నా ఇల్లెందును మాత్రం విడదీయడం లేదన్నారు. ఇల్లెందు డివిజన్ ఏర్పాటు చేయటంలోనూ పాలకులు నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. సీతారామా ప్రాజెక్టును ఇల్లెందుకు మళ్లించడంలోనూ బీఆర్ఎస్, కాంగ్రెస్ పాకులులు నిర్లక్ష్యం చేస్తున్నట్లు పేర్కొన్నారు. బొగ్గు బావులతో కళకళలాడిన ఇల్లెందు బోసిపోయిందన్నారు. ఈ సమావేశంలో కృష్ణ, కిరణ్, మోహన్‌రావు, రాములు, లక్ష్మి, సర్వన్, ఖాదర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నబీ

‘కార్పొరేషన్’తో కొద్దిమందికే ప్రయోజనం



మాట్లాడుతున్న కాసాని ఐలయ్య

సుజాతనగర్: ఎవరి ప్రయోజనాల కోసం ఉమ్మడి సుజాతనగర్‌ను కార్పొరేషన్ చేస్తున్నారని సీపీఎం నాయకులు కాసాని ఐలయ్య ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో సుజాతనగర్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి సుజాతనగర్ పంచాయతీని కార్పొరేషన్ చేయాలనే ప్రతిపాదన సరైంది కాదన్నారు. సుజాతనగర్ మండలం ఇంకా గ్రామీణ వ్యవస్థగానే మిగిలి ఉందని, ఈ ప్రాంతంలో వ్యవసాయ కూలీలు, కార్మికులు ఉన్నారని, కొద్దిమంది ప్రయోజనాల కోసమే కార్పొరేషన్ ఉపయోగపడుతోందని ఆరోపించారు. కార్పొరేషన్ వలన ఇంటి పన్నులు, పంపు బిల్లులు పెరిగే అవకాశం ఉందని, ధరలు పెరిగి సామాన్యుడికి పెనుభారంగా మారే అవకాశం ఉందన్నారు. ఉమ్మడి సుజాతనగర్‌ను కార్పొరేషన్ చేసే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో అన్నివర్గాల ప్రజలను కలుపుకొని ఉద్యమిస్తామన్నారు. అవసరం అయితే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ధర్మా, వీర్ల రమేష్, కాట్రాల తిరుపతిరావు, కొండె కృష్ణ, నల్లగోపు పుల్లయ్య, బచ్చలకూర శ్రీనివాస్, గండమల భాస్కర్, ఉడుగుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

‘కుడా’ ఎందుకు?

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఏర్పాటు ఎవరి కోసమని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం కొత్తగూడెం క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో పాతవి 15 అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు ఉన్నాయని తెలిపారు. ఇటీవల కొత్తగా 13 అథారిటీలను ఏర్పాటు చేయగా కొత్తగూడెం (కుడా) మినహా మిగతా అన్నీ 100కు పైగా గ్రామాలు ఉన్నాయని కుడాలో మాత్రమే కేవలం ఒకే ఒక్క గ్రామాన్ని కలిపారని, దీని వలన అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ఏజన్సీ చట్టాలను తుంగలో తొక్కి హడావుడి చేయడమేంటని నిలదీశారు. కుడా వలన గ్రామీణ ప్రాంతాల వారు హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందని, ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గంధం మల్లికార్జునరావు, మాలోత్ వీరునాయక్, సాయి, వెంకట్, దిలీప్, గుడివాడ రాజేందర్ పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి..



ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న దుర్గాప్రసాద్

జూలూరుపాడు: కొమ్ముగూడెం – కరివారిగూడెం గ్రామాల మధ్య బీటీ రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతూ భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్ ఆదివారం జూలూరుపాడులో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొమ్ముగూడెం – కరివారిగూడెం గ్రామాల మధ్య గల బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రెండు గ్రామ పంచాయతీలకు చెందిన ప్రజలు, రైతుల కష్టాలను తీర్చాలన్నారు. స్పందించిన ఎమ్మెల్యే బీటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టే విధంగా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో లేళ్ల వెంకటరెడ్డి, బానోత్ విజయబాయి, మాలోత్ మంగీలాల్ నాయక్, దుద్దుకూరి మధుసూదన్‌రావు, కొదుమూరి కోటేశ్వరరావు ఉన్నారు.

సింగరేణిలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ విజిట్

సింగరేణి(కొత్తగూడెం): హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఈనెల 28న రూల్ ఆఫ్ రిజర్వేషన్ రోస్టర్ విధానాన్ని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కమిషన్ బక్కి వెంకటయ్యతోపాటు ఐదుగురు కమిషన్ సభ్యులు విజిట్ చేయనున్నారు. ఈ సందర్భంగా సింగరేణిలో ఎస్సీ/ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతులు, ఉద్యోగాల భర్తీపై జరుగుతున్న అన్యాయంపై చర్చించనుందని, సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఆంతోటి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ సమావేశానికి కేంద్ర కమిటీ సభ్యులు, అధ్యక్షులు డాక్టర్ రాజేశ్వర్, వైస్ ప్రసిడెంట్ ఎంపీ రావు, జాయింట్ సెక్రటరీ కనుగుల తిరుపతి, జిమ్మిడి మల్లేష్, కొనగంటి అంకూస్, ఇరుగురాళ్ల శ్రీనివాస్‌తో పాటు చీఫ్‌లైజన్ ఆఫీసర్ దుర్గం రాంచందర్ (మణుగురు ఏరియా జీఎం)తో పాటు 11 ఏరియాల లైజన్ ఆఫీసర్లు పాల్గొంటారని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే విన్నవించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిమ్మిడి మల్లేష్, బందెల విజేందర్, మోరే రమేష్, వెంకటేశ్వర్లు, ఆంతోటి రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

కూలి రేట్లు పెంచాలని హమాలీల సమ్మె



సమ్మె ప్రకటిస్తున్న నాయకులు, హమాలీలు

టేకులపల్లి: మండలంలో హమాలీ కూలి రేట్లు పెంచాలని వ్యాపారులతో జరిగిన చర్చలు విఫలం అయ్యాయని, దీంతో మండలంలో హమాలీలు సమ్మె చేస్తున్నట్లు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ చంద్రన్నవర్గం నాయకులు బానోత్ ఊక్లా, భూక్యా హర్ష్య, సీపీఎం నాయకుడు రేపాకుల శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం సేవాలాల్ ఆలయంలో జరిగిన హమాలీల జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడుతూ... ప్రతీ సంవత్సరం పెరిగిన నిత్యావసరాల ధరల ప్రకారం కూలి రేట్లు పెంచాలని 2020, 2022లో గత రేట్లపై 9 శాతం పెంచుకోవడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం కూడా పెంచాలని డిమాండ్ చేసినప్పటికీ రేట్లు పెంచకపోవడం సరైంది కాదని పేర్కొన్నారు. 9 శాతం పెంచే వరకు హమాలీలు సమ్మెలో కొనసాగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొడ మంచా, భూక్యా బాలాజీ, భూక్యా దళసింగ్, నోముల భానుచందర్, భూక్యా నర్సింగ్, నాగేశ్వరరావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మరోమారు గెలిపించుకుందాం..



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు: ఖమ్మం, వరంగల్, నల్లగొండ టీఎస్‌యూటీఎఫ్ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి, శాసన మండలి సభ్యులు అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోమారు గెలిపించుకుందామని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.కిషోర్ సింగ్ కోరారు. ఆదివారం ఇల్లెందులో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఏ.రాంబాబు అధ్యక్షతన జరిగింది. అంతకు ముందు ఎమ్మెల్సీ ఎన్నికల పోస్టర్లు ఆవిష్కరించారు. కిషోర్ సింగ్ మాట్లాడుతూ... ఈ డివిజన్‌లో ఉన్న మండలాల బాధ్యులు తమ అభ్యర్థి గెలుపు కోసం ప్రణాళికా బద్ధంగా కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల జిల్లా ప్రధాన కార్యదర్శి టి.జాన్ మాట్లాడుతూ... అంతా కలిసి కట్టుగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల కార్యదర్శి పి.జయరాజు, ఉపాధ్యక్షులు కె.అన్నపూర్ణ, కృష్ణవేణి, ఎల్.రూప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.